క్లుప్తంగా

గ్రామ సచివాలయ కన్వీనర్లు హాజరు కావాలి

దొనకొండ: ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌కు చెందిన దర్శి నివాసంలో శుక్రవారం 10 గంటలకు దొనకొండ మండలంలోని గ్రామ సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు హాజరు కావాలని మండల సచివాలయాల కన్వీనర్ గుంటు పోలయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే సమక్షంలో ఎమ్మెల్సీ ఎన్నికల గురించి చర్చించటం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల్లోని ఎమ్మెల్సీ ఓట్ల జాబితాను తీసుకుని రావాలని తెలిపారు.

వైద్యశాల ప్రారంభం



వైద్యశాల ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గిద్దలూరు రూరల్: పట్టణంలోని శివాజి లాడ్జి సమీపంలో స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు అరుణోదయ మల్టీ వైద్యశాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాల నిర్వాహకురాలు డా. అగస్య ప్రజలకు మరిన్ని వైద్యసేవలను అందిస్తూ గుర్తింపు తెచ్చుకోవాలని కోరారు. నాయకులు పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పర్చూరి నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

ముండ్లమూరు: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో బొమ్మినేని అనిల్‌బాబుకి దర్శి జడ్జి ఐదు రోజులు జైలు శిక్ష, ఐదు వేల నగదు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ ఎల్. సంపత్‌కుమార్ గురువారం తెలిపారు. బుధవారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన అనిల్‌బాబుని గురువారం దర్శి కోర్టులో హాజరు పరిచామన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన

ముండ్లమూరు: రైతులు తమకి గల భూమిలో నవధాన్యాలు సాగుతో లబ్ధి పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ సీఎస్‌ఎఫ్ వెంకటరమణ తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో గురువారం రైతులకు నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రభాకర్, సీసీలు గురవయ్య, మోహనరావు, సీఆర్పీలు వేణుగోపాల్, వెంకట్రావు, రామాంజి, వాణి, రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

తర్లుపాడు: మండలంలోని నాగేళ్ళముడుపులో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ తర్లుపాడు శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన గురువారం సదస్సు నిర్వహించారు. అసిస్టెంట్ మేనేజర్ హెప్సిబా, క్యాషియర్ అనుషా, సిబ్బంది, బొప్పరాజు శ్రీనివాసులు, వెంకటప్రసాద్, పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు పూర్తి కావాలి

మార్కాపురం టౌన్: ఉగాది పండగకు జగనన్న ఇళ్లల్లో గృహ ప్రవేశాలు చేసేలా చర్యలు తీసుకోవాలని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సాయి కుమార్ సచివాలయ సిబ్బందికి సూచించారు. గురువారం గొగులదిన్నె సచివాలయంలో సమావేశం నిర్వహించారు.


పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

ముండ్లమూరు: పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ గురువారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డిని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిని గెలిపించాలని కోరారు. సీపీఎం నాయకులు వెల్లంపల్లి ఆంజనేయులు, హనుమంతరావు, పంటా ఏడుకొండలు పాల్గొన్నారు.

పొగాకు అపహరణపై కేసు నమోదు

ముండ్లమూరు: మండలంలోని పసుపుగల్లు గ్రామంలో ఎనిమిది క్వింటాళ్ల పొగాకు అపహరణపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎల్. సంపత్‌కుమార్ తెలిపారు. పసుపుగల్లు గ్రామానికి చెందిన వలేటి పేతురు పొలంలో పొగాకు గుచ్చిన తాడులు గుర్తు తెలియని వ్యక్తులు అపహరణ చేసినట్లు, వాటి విలువ లక్ష రూపాయలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం



శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఓ

మార్కాపురం: స్థానిక మార్కెట్ యార్డులో శనగ రైతులు తాము పండించిన శనగలను అమ్ముకునేందుకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు కోరారు. గురువారం శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పీఏసీఎస్ సీఈఓ తిప్పిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

- కోరిన వారందరికీ పనులు
- రానున్న వార్షిక సంవత్సరానికి ప్రణాళిక పూర్తి
- రైతు పొలాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత

పల్లెకు 'ఉపాధి' మార్గం



తూర్పుగంగవరంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

తాళ్లూరు: వలసలను నివారిస్తూ స్థానికంగానే కూలీలు వ్యవసాయంతో పాటు ఉపాధి పనులు చేసుకుని జీవనం సాగించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బీడు భూమిని సాగులోకి తీసుకువచ్చేందుకు ఉపాధి హామీలో అవకాశం కల్పించి రైతులను ఆదుకుంటోంది. తద్వారా ఇతర పట్టణాలను పనుల కోసం వలస వెళ్లే వారి సంఖ్య తగ్గింది. రైతులు కూడా తమ భూములను అభివృద్ధి చేసుకుంటూ జీవన ప్రమాణాలు పెంచుకుంటున్నారు.

2022–23లో రూ. 11.04 కోట్ల పనులు

మండలంలో 16 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ ద్వారా ప్రభుత్వం రూ. 11.04 కోట్ల విలువైన 3.33 లక్షల రోజుల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతి కూలీకి పని కల్పించింది. గడువు ముగుస్తున్న వార్షిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ. 5.52 కోట్ల విలువైన 2.64 లక్షల పనిదినాలు పూర్తి చేశారు. మిగిలిన పనులు కూడా పూర్తి చేస్తున్నారు. మండలంలో 10,037 జాబ్ కార్డులు, 72 శ్రమ శక్తి సంఘాలున్నాయి. అందులో 24 పురుష మేట్‌లు, 48 మహిళా మేట్‌లు పనిచేస్తున్నారు. ప్రస్తుతం 15 పంచాయతీల్లో ప్రతి రోజూ 1000 మంది కూలీలు పని చేస్తున్నారు. పంట కాలువలు, ఉద్యాన వన పంటలు, జగనన్న గృహ నిర్మాణ పనులకు కూలి చెల్లిస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో సైతం గ్రామ సభలు నిర్వహించి కూలీల్లో చైతన్యం తీసుకురానున్నట్లు పేర్కొన్నారు.

> **లక్ష్యాన్ని అధిక మిస్తాం:** మండలంలో 10,037 జాబ్ కార్డులో ఎక్కుమంది కూలీలకు పనికల్పిస్తున్నాం. ఇప్పటికే 5.50 కోట్ల విలువైన పనులు చేపట్టి 2.64లక్షల రోజుల పనిదినాలు కల్పించాం. రోజుకు గరిష్టంగా రూ. 160 చెల్లిస్తున్నాం. ఇది మరింత పెరిగేలా చర్యలు తీసుకుంటాం. జగనన్న గృహాలకు కూడా 90 నివాసాలకు.. ఒక్కొక్కరికి రూ. 23,130 చెల్లించాం. – మురళి, ఏపీఓ, తాళ్లూరు



సూర్య, చంద్ర వాహనంపై శ్రీవారి ఉత్సవం



వెలుగొండ పురవీధుల్లో ఉత్సవం

వెలుగొండ (కొనకనమిట్ల): వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం, సాయంత్రం శ్రీలక్ష్మీ అలివేలుమంగ వెంకటేశ్వరస్వామి వార్లను సూర్య, చంద్ర వాహనాలపై ఉత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన శ్రీవారి ఉత్సవ మూర్తులను వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య మేళతాళాలతో వెలుగొండ పురవీధులలో ఊరేగించారు. జవ్వాజి వెలుగొండయ్య, శ్రీనివాసులు, వెలుగొండయ్య, సుబ్బయ్య, సత్యం, క్రిష్ణ, నాగేశ్వరరావు, సత్యన్నారాయణ, వీరనారాయణ, అప్పారావు, భాస్కరరావు తదితరులు కార్యక్రమానికి ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈఓ చెన్నకేశవ రెడ్డి, కమిటీ చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, ధర్మకర్తల పర్యవేక్షణలో కొనసాగాయి.

కురిచేడు: మండలంలోని బోధనంపాడులో వేంచేసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి తిరునాళ్ల శుక్రవారం అత్యంత వైభవంగా జరగనుంది. ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆలయ ధర్మకర్త లక్కాకుల చిన్న వెంకటేశ్వర్లు తెలిపారు. అన్నదానం, తాగునీరు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

బండ లాగుడు పోటీలు రేపు

దొనకొండ: మండలంలోని గంగదేవిపల్లి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్య తిరునాళ్ల శనివారం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు వరుస బహుమతులుగా అందిస్తామని చెప్పారు.

భక్తులకు అన్నదానం

గిద్దలూరు రూరల్: మండలంలోని నరవలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి తిరునాళ్ల సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలకు విచ్చేస్తున్న భక్తులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కామూరి రమణారెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ లక్ష్మీనరసింహా స్వామి తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల పోటీలకు వచ్చేవారికి స్వామి వారిని తిలకించేందుకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా భోజన వసతి ఏర్పాటు చేశామన్నారు.

ఊపందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



మార్కాపురం: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- స్ట్రాంగ్ రూంకు పోలీస్ భద్రత
- చెక్‌పోస్ట్‌ల ఏర్పాటు



పొదిలిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ పట్టభద్రుల, ఉపాధ్యాయ స్థానాలకు ఈ నెల 13న జరుగుతున్న ఎన్నికల్లో ప్రచారం ఊపందుకుంది. వైఎస్సార్ సీపీ పట్టభద్రుల అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీ చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డిల గెలుపును కాంక్షిస్తూ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మార్కాపురం టౌన్, రూరల్, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. మార్కాపురం టౌన్‌లో మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్, ఎంపీపీ అరుణచెంచిరెడ్డి, తర్లుపాడు ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, కేకేమిట్ల ఎంపీపీ మురళీకృష్ణ, జెడ్పీటీసీ ఏడుకొండలు, పొదిలి నూర్జాహన్, గొలమారి చెన్నారెడ్డితో పాటు పలువురు నాయకులు ప్రచారంలో పాల్గొంటున్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయానికి బ్యాలెట్ బాక్స్‌లు, ఎన్నికల సామగ్రి రావడంతో స్ట్రాంగ్ రూం ఏర్పాటు చేసి పోలీస్ రక్షణ కల్పించారు. పట్టణానికి 4 వైపుల పోలీస్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో మొత్తం టీచర్స్, గ్రాడ్యుయేట్ ఓటర్లు కలిపి 11, 658 మంది ఉన్నారు. ఇందులో గ్రాడ్యుయేట్ ఓటర్లు 10833కాగా టీచర్ ఓటర్లు 825 మంది ఉన్నారు.

పొదిలి రూరల్: వైఎస్సార్‌సీపీ బల పరచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్ర శేఖర్‌రెడ్డిలను గెలిపించాలని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కోరారు. పొదిలిలోని దర్శి రోడ్డులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కసిరెడ్డి రమణారెడ్డి, మండల పార్టీ కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, కంభం మాజీ ఏఎంసీ చైర్మన్ వై వెంకటేశ్వరరావు, మాదాలవారిపాలెం సొసైటీ అధ్యక్షుడు కొత్తపల్లి బ్రహ్మారెడ్డి, అంబవరపు నారాయణరెడ్డి, పేరం కోదండరామిరెడ్డి, నాయకులు,కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

తాళ్లూరు: తూర్పుగంగవరం, రామభద్రాపురం, విఠలాపురం, రమణాల వారిపాలెంలో గురువారం మండల జేసీఎస్ కన్వీనర్ యాడిక శ్రీనివాస రెడ్డి ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు ఓట్లను అభ్యర్థించారు. ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

కురిచేడు: జెడ్పీటీసీ నుసుం వెంకటనాగి రెడ్డి గురువారం మండలంలోని ముష్టగంగవరం, నాంచారపురం, పడమర నాయుడుపాలెంలో ప్రచారం నిర్వహించారు. బొమ్మనబోయిన చిన వెంకయ్య, ఎన్వీ నాగిరెడ్డి, వెలుతుర్ల ఏడుకొండలు రెడ్డి, కృష్ణ, కోలా సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండలంలో సిద్దవరం, చేరెడ్డివారిపల్లిలో ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, ఉడుముల గురవారెడ్డి, సచివాలయ కన్వీనర్ పూరవరపు పెదవెంకటరెడ్డి, ఎంపీటీసీ మీరావలి పాల్గొన్నారు.

కొమరోలు: జెడ్పీటీసీ సభ్యులు సారె వెంకటనాయుడు దద్దవాడ, అలసందలపల్లె లో పర్యటించారు. నల్లగుంట్ల సర్పంచ్ ప్రదీప్, రామచంద్రుడు, రమణమ్మ, వెంగయ్య చౌదరి పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రభపై మాట్లాడుతున్న మంత్రి సురేష్

- మంత్రి ఆదిమూలపు సురేష్
- బంగారమ్మ ఆలయంలో పూజలు

పుల్లలచెరువు: రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని మున్సిపల్ శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. బుధవారం రాచకొండ గ్రామంలో బంగారమ్మ దేవర తిరునాళ్ల సందర్భంగా మంత్రి సురేష్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలపై మంత్రి మాట్లాడారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పేదల ముఖాల్లో చిరునవ్వు చూడాలనే సంకల్పంలో సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు అవాకులు చవాకులు పేలుతున్నాయని విమర్శించారు. ప్రతి గ్రామంలో సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. త్వరలోనే టి–5 కాలువ పనులకు టెండర్లు పిలిచి పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. వెలుగొండ ప్రాజెక్టు కాలువతో పాటు వరికపూడిసెల ద్వారా పుల్లలచెరువు మండలంలోని అన్ని గ్రామాలకు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం మంత్రి సురేష్‌ను పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ లాజర్, మండలకన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, వైపాలెం కన్వీనర్ ఓబుల్‌రెడ్డి, జెడ్పీటీసీ వాగ్యానాయక్, శ్రీశైలం దేవస్థానం ట్రస్టు మాజీ సభ్యుడు సుబ్బారావు, నాయకులు రోసిరెడ్డి, వెంకటరెడ్డి, సత్యనారాయణరెడ్డి, సుబ్బయ్య, నారాయణరెడ్డి, బంగారురెడ్డి, గోవింద్‌రెడ్డి, రాములు, శ్రీనివాసరెడ్డి, మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రూ. 3.23 లక్షల చెక్కు అందజేత



చెక్కును సుబ్బయ్య భార్యకు అందచేస్తున్న దాతలు

కొమరోలు: మండలంలోని సర్విరెడ్డిపల్లె గ్రామానికి చెందిన మైలగాని సత్యం రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. సోషల్ మీడియా ద్వారా దాతలు స్పందించి 3.23 లక్షలు అందచేశారు. క్షతగాత్రుడు సుబ్బయ్య మిత్రులు వెంకటసత్యం, రమణ, సాంబడు, గంగరాజు, దస్తగిరి, వెంకటరెడ్డి నగదును దాతల ద్వారా ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలలో సుబ్బయ్య భార్య రాజ్యలక్ష్మికి చెక్కు అందించారు.

బెల్లం తయారీలో జాగ్రత్త



బెల్లం తయారీ పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

తాళ్లూరు: బెల్లం తయారీలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు కోరారు. నాగంబొట్లపాలెంలోలో గురువారం క్షేత్ర పర్యటనలో భాగంగా బెల్లం తయారీ క్రషర్లను పరిశీలించారు. నాణ్యత పాటిస్తే మంచి ధర లభిస్తుందన్నారు. వీఏఏలు శ్రీను, ఆదర్శ రైతు కైపు నాగి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పథకాలు ప్రజలకు వివరించండి



మార్కాపురం: ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ప్రతినిధులు

మార్కాపురం టౌన్: జగనన్న పథకాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. నియోజకవర్గ సోషల్ మీడియా సభ్యులు ఎమ్మెల్యేతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, రైతు భరోసా, నాడు- నేడు, చేయూత, ఆసరా తదితర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. వాసుదేవరెడ్డి, శివారెడ్డి, శేఖర్, ఇంద్రసేనారెడ్డి, దాసు, ఎల్లారెడ్డి, రజిని, రంగయ్య తదితరులున్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

కొనకనమిట్ల: దేవాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి స్పష్టం చేశారు. చినారికట్ల గ్రామంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలు, అయ్యప్పస్వామి నగరోత్సవంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కమిటీ నిర్వాహకులు ఉడుముల గురవారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, రామనారాయణరెడ్డి, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, సొసైటీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ గోసుల అనురాధ, ఎంపీటీసీ ఉడుముల ధనలక్ష్మి, బంగారురెడ్డి పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం నేడు

పొదిలి రూరల్: జిల్లాలోని ప్రైవేటు జూనియర్, డిగ్రీ, బీఈడీ కళాశాలల యాజమాన్య మిత్రుల ఆత్మీయ సమ్మేళనం పొదిలిలోని దర్శి రోడ్డులో గల మంజునాథ కళ్యాణ మండపంలో శక్రవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని కళాశాల ప్రతినిధులు కేవీ రమణారెడ్డి ,వై. వెంకటేశ్వరరావు, కె. గుండారెడ్డి, నరాల ఈశ్వర్‌రెడ్డి, వీఆర్‌కే ప్రసాద్, మహమ్మద్ ఆకిబ్ అహ్మద్, ఏవీ రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు, తిరుపతి, కడప, చిత్తూరు జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి హాజరవుతారన్నారు. ఏర్పాట్లను గురువారం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పరిశీలించారు. సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, అంబవరపు నారాయణ రెడ్డి, పేరం కొదండ రామిరెడ్డి ఉన్నారు.

వైభవంగా సంతాన వేణుగోపాలస్వామి తిరునాళ్ల



తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రభలు



పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి

పుల్లలచెరువు: మండలంలోని ముటుకుల గ్రామంలో సంతాన వేణుగోపాల స్వామి తిరునాళ్ల గురువారం వైభవంగా నిర్వహించారు. పశ్చిమ ప్రాంతంలో ముటుకుల తిరునాళ్ల ఎంతో ప్రసిద్ధి చెందింది. సంతాన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో శివాలయం, ఆంజనేయస్వామి ఉపాలయాల్లో నూతనంగా నవగ్రహాలను ప్రతిష్ఠించినట్లు ఆయన ధర్మకర్త సూర్యప్రకాశరావు తెలిపారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు 5 విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. సాయంత్రం వేణుగోపాలస్వామి కల్యాణాన్ని ఆలయ అర్చకుడు భరద్వాజశాస్త్రి బృందం కనుల పండువగా నిర్వహించింది.

విద్యుత్ ఏఈగా ఎస్ఎస్ రావు

బేస్తవారిపేట: స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏఈ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఎస్ఎస్ రావును ఏఈగా నియమిస్తూ ఒంగోలు విద్యుత్‌శాఖ ఎస్‌ఈ కేవీజీ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఏఈగా పూర్తి అదనపు బాధ్యతలను ఎస్ఎస్ రావు గురువారం చేపట్టారు. విద్యుత్‌శాఖ సమస్యలు సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

మాజీ సర్పంచ్ మృతి



నివాళులర్పిస్తున్న ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు , ఇన్‌సెట్‌లో సుబ్బులు (ఫైల్)

తాళ్లూరు: శివరామపురం మాజీ సర్పంచి నిశంకం సుబ్బులు (78) గురువారం మృతి చెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందారు. ఆమె కుమారుడు హనుమంతరావు వైఎస్సార్‌సీపీ గ్రామ క్రియాశీలక నాయకుడిగా ఉన్నారు. భర్త వెంకటేశ్వర్లు ప్రముఖ శిద్ధాంతిగా పేరు పొందారు. వైఎస్సార్‌సీపీ తాళ్లూరు మండల ఇన్‌చార్జి మద్దిశెట్టి రవీంద్ర, జెడ్పీటీసీ మారం వెంకట రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఇడమకంటి వేణుగోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఇడమకంటి వెంకటేశ్వర రెడ్డి, సర్పంచిలు వలి, పీఎం శ్రీకాంత్ రెడ్డి.. మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

విద్యుత్ అధికారుల దాడులు

మార్కాపురం టౌన్: పట్టణంలో గురువారం విద్యుత్ శాఖ అధికారుల ఆకస్మికంగా దాడులు చేసినట్లు డీఈ సియా నాయక్ తెలిపారు. సూమారు రూ. 2.90 లక్షలు ఆపరాధ రుసుం విధించారు. డీపీఈ డీఈలు హైమావతి, నాగేశ్వరరావు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

గిద్దలూరు రూరల్: నియోజకవర్గంలో మార్చి 13న నిర్వహించబోయే పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని పోలింగ్ కేంద్రాలను స్థానిక తహసీల్దార్ బి.రమాదేవి తనిఖీ చేశారు. పట్టభద్రులకు, టీచర్లకు మొత్తం నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఓటర్లు ఎన్నికల నిబంధనలకు లోబడి వారి ఓటు హక్కును వినియోగించుకోవాల్సిందిగా కోరారు. డీటీ బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, రీసర్వే డీటీ జె.వెంకటయ్య, మండలం సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్‌ఓలు వై.పి.రంగయ్య, వెంకటరామయ్య, సిబ్బంది ఉన్నారు.

ఒత్తిడి జయిస్తే విజయం

కొనకనమిట్ల: చదువే భవితకు మూలమని, ఒత్తిడిని జయిస్తే విజయం మీదేనని గొట్లగట్టు కేజీబీవీ ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ అన్నారు. గురువారం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఇంటర్, 10వ తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

పట్టుదలతో విద్య అభ్యసిస్తే మంచి ఫలితాలు

కొమరోలు: పట్టుదలతో విద్యను అభ్యసిస్తే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చైతన్యదీపక్ తెలిపారు. స్థానిక ప్రగతి జూనియర్ కళాశాలలో యానివర్సరీ డే సందర్భంగా గురువారం విద్యార్థులకు సమావేశాన్ని నిర్వహించారు. కళాశాల డైరెక్టర్లు క్రిష్ణారెడ్డి, సందీప్‌రెడ్డి, లెక్చరర్లు పాల్గొన్నారు.

సమాజ మార్గదర్శకులు పాత్రికేయులు



నివాళులర్పిస్తున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: సమాజ మార్గదర్శకులు పాత్రికేయులు అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి అన్నారు. గురువారం పశ్చిమ ప్రకాశం తొలిరతం పాత్రికేయులు ఒరుగంటి రమణయ్య వర్ధంతి కార్యక్రమం గురువారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. సీనియర్ పాత్రికేయులు ఓవీ రమణయ్య కుమారుడు ఓపీ మల్లిక్, మున్సిపల్ చైర్మెన్ చిర్లంచర్ల బాలమురళీ కృష్ణ, రిటైర్డు ఆర్‌జేడీ డాక్టర్ ఏ.వీరారెడ్డి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఎస్‌వీ రమణ, టి. జగన్నాథ్, దక్షిణామూర్తి, ఆర్‌కేజే నరసింహం, రామకృష్ణ, పాల్గొన్నారు. అనంతరం ఓవీ రమణయ్య కాంస్య విగ్రహానికి నివాళులర్పించారు.

డివైడర్‌ను ఢీ కొన్న కారు

మార్కాపురం: చింతగుంట్ల జాతీయ రహదారిపై కారు టైర్ పేలి డివైడర్‌ను ఢీ కొన్న సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. కంభానికి చెందిన మధు చెన్నై నుంచి మార్కాపురానికి కారులో వస్తుండగా చింతగుంట్ల గ్రామా సమీపంలో కారు టైర్ పేలి కుడి వైపున ఉన్న డివైడర్‌ను ఢీ కొంది. దీంతో కారు ముందు భాగం నుజ్జుకాగా డ్రైవర్ మధుకు గాయాలయ్యాయి.